
ప్రజాశక్తి

శనివారం 13 సెప్టెంబర్ 2025 · 5 · విజయనగరం



సమస్యల పరిష్కారానికి దశల వారీ పోరాటం

విద్యుత్తుశాఖ ఎస్ఇకి జెఎసి నాయకుల నోటీసు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యుత్ సంస్థలో దీర్ఘ కాలంగా ఉన్న అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా విజయనగరం ఎస్ఇ ఎం.లక్ష్మణరావుకు శనివారం సర్కిల్ జెఎసి నాయకులు నోటీసు అందజేశారు. సమస్యల పరిష్కారానికి ఈనెల 15 నుండి దశల వారీగా పోరాటం చేస్తామని తెలిపారు. 15,16 తేదీలలో నల్ల బ్యాడ్జీలు ధరించడం, 17,18 తేదీల లో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ధర్నాలు, జిల్లా కేంద్రంలో 19,20 తేదీల్లో రిలే నిరాహార దీక్షలు, 22న జిల్లా కేంద్రం లో శాంతి ర్యాలీ, చేపడతామని తెలిపారు. అప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం, ట్రాన్స్‌కో మేనేజ్‌మెంట్ స్పందించకపోతే నిరవధిక సమ్మెకు వెళ్తామని జెఎసి జిల్లా చైర్మన్ సురగాల లక్ష్మణ్, కన్వీనర్ బండారు రాజేష్ కుమార్, కో చైర్మన్ పప్పల అప్పలస్వామి నాయుడు, పూసపాటి సీతారామరాజు, గొంప అప్పలసూరి, రుంకాన అప్పలనాయుడు తెలిపారు.

విజ్ఞాన పండగకు సర్వం సిద్ధం


నేటి నుంచి రెండు రోజులపాటు జెవివి రాష్ట్ర మహాసభ

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



జెవివి మహాసభ ప్రాంగణం(జెడ్‌పి) వద్ద స్వాగతం ద్వారం

జన విజ్ఞానవేదిక 18వ రాష్ట్ర మహాసభలు నగరంలో నేటి నుంచి రెండు రోజులు పాటు జరగనున్నాయి. దీనికి సంబంధించిన ఏర్పాట్లు సర్వం సిద్ధమయ్యాయి. మహాసభలకు వేదిక కానున్న జిల్లా పరిషత్ సమావేశ మందిరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిద్దారు. జెడ్‌పి ప్రాంగణం వద్ద అతిథులకు, ప్రతినిధులకు ఆహ్వానం పలుకుతూ స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు. ప్రాంగణం లోపల, బయట, నగరంలోని పలు కూడళ్లలోనూ మహాసభల ప్రాధాన్యత, కర్తవ్యాలు, హాజరు కాబోయే ముఖ్యవక్తలు తదితరాలతో కూడిన హోర్డింగ్ బోర్డులను, గోడపత్రికలను ఏర్పాటు చేశారు. మరోవైపు హాజరుకానున్న 400మంది ప్రతినిధులకు భోజనాలు, విడిది సౌకర్యం వంటివి ఏర్పాటు చేశారు. ఈ రెండు రోజులపాటు అన్ని ఏర్పాట్లు, సాయం చేసేందుకు ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు, కార్యకర్తలు వాలంటీర్లుగా వ్యవహరించనున్నారు. ఇప్పటికే వీరంతా ఆయా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ముఖ్యంగా మహాసభల్లో గడిచిన రెండేళ్లలో జన విజ్ఞాన వేదిక చేసిన కృషి, ఫలితాలను సమీక్షించుకోవడంతో పాటు భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందించుకోనున్నారు. మహాసభలకు ముఖ్య అతిధిగా ఆలిండియా పీపుల్స్ సైన్స్ నెట్ వర్క్ ప్రధాన కార్యదర్శి (ఎఐపిఎస్ఎన్) ఆశామిశ్రా, ప్రధాన వక్తగా ప్రముఖ రాజకీయ విశ్లేషకులు ప్రొఫెసర్ నాగేశ్వర్ హాజరు కానున్నారు. మహాసభల ప్రారంభ సూచికగా జెవివి జెండాను నారు సింహాద్రినాయుడు, అభ్యుదయ కవి, రచయిత గంటేడ గౌరునాయుడు, జాతీయ జెండాను ప్రముఖ వయోలిన్ విద్వాంసులు ద్వారం దుర్గాప్రసాద్‌రావు ఆవిష్కరించనున్నారు. జెవివి జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎంవిఎన్ వెంకటరావు ఆహ్వానం పలకనున్నారు. ఆహ్వాన సంఘం అధ్యక్షులు (జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి) డివి రమణ స్వాగతోపన్యాసం చేస్తారు. జిల్లాకు చెందిన రాష్ట్ర ఎంఎస్ఎంఇ మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేర్కర్, జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి సందేశాలు ఇవ్వనున్నారు. శనివారం సాయంత్రం రాష్ట్ర సమగ్రాభివృద్ధి అనే అంశంపై మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ఉపన్యాసం చేయనున్నారు. రెండో రోజు ఉదయం 5:30గంటల నుంచి 7.30 గంటల వరకు మహాసభల్లో పాల్గొన్న ప్రతినిధులంతా నగరంలో సైన్స్‌వాక్ చేయనున్నారు. హోటల్ మయూర పరిసర ప్రాంతం నుంచి ట్యాంక్‌బండ్ రోడ్డు, బాలాజీ జంక్షన్, కోట మీదుగా గురజాడ నివాసం మీదుగా సంగీత కళాశాల వరకు సైన్స్ వాక్ నిర్వహిస్తారు. గురజాడ ఇంటిని కాపాడాలని, సాంస్కృతిక విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని, గురజాడ జయంతిని రాష్ట్ర ఉత్సవంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈ వాక్ జరుగుతుంది. 9గంటలకు తిరిగి ప్రతినిధుల సభ పున:ప్రారంభమౌతుంది. పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ కీలక ఉపన్యాసం చేయనున్నారు. అనంతరం కార్యదర్శి నివేదికపై చర్చలు, యూత్, సమతా సెషన్స్, కీలక తీర్మానాలు ఉంటాయి. మాజీ ఎమ్మెల్సీ వి.బాల సుబ్రమణ్యం ముగింపు ఉపన్యాసం చేయనున్నారు. మహాసభల్లో రెండు రోజులపాటు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించనున్నారు.



వేదిక వద్ద సిద్ధం చేసిన ఏర్పాట్లు

ఏచూరి ఆశయ సాధనకు కృషి

వర్ధంతి సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని



ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తమ్మినేని, నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సిపిఎం అఖిల భారత కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం దేశ ప్రజలకు తీరని లోటు అని, ఆయన ఆశయ సాధనకు, సమ సమాజ స్థాపనకు కృషి చేసినప్పుడే మనమిచ్చే ఘనమైన నివాళి అని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభ స్థానిక ఎల్‌బిజి భవనంలో జరిగింది. ఏచూరి చిత్రపటానికి ముందుగా సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.లక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ సీతారాం ఏచూరి విద్యార్థి ఉద్యమం నుంచి పేదలు, సమాజం, కోసం, భారత దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడటం కోసం చివరి వరకు పని చేశారన్నారు. ప్రపంచ దేశాల్లో ఆయనకు సైద్ధాంతిక విషయంలో ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. పాలక వర్గాలు తప్పులను ఎదురించడంలో రాజ్యసభ, పార్లమెంట్‌లో ఆయన చేసిన కృషి మరువ లేనిదన్నారు. ప్రజల సమస్యలపై లోతైన అవగాహన ఉండేదన్నారు. సమానత్వం, సోషలిజం కోసం అంకితభావంతో పని చేశారన్నారు. నేడు ఆయన లేకపోవడం భారత దేశానికి తీరని లోటు అన్నారు. మతోన్మాదాన్ని రెచ్చగొట్టడం, దేశ స్వాతంత్ర్య పోరాటంలో దేశానికి ద్రోహం చేసిన వారు నేడు దేశాన్ని పాలిస్తున్నారన్నారు. బ్రిటీష్ వారికి ఏజెంట్లుగా ఉంటామని లేఖలు రాసిన బిజెపి నేడు పాలకులుగా రావడం దేశ దౌర్భాగ్యం అన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో సీతారాం ఏచూరి లేకపోవడం భారత దేశ ప్రజలకు తీరని లోటు అన్నారు. దోపిడీకి వ్యతిరేకంగా, సమ సమాజం కోసం ఆయన స్ఫూర్తితో కృషి చేయాలని కోరారు.

సీనియర్ నాయకులు ఎం.శ్రీనివాస మాట్లాడుతూ సీతారాం ఏచూరి హరికిషన్ సింగ్ సూర్జిత్ తర్వాత దేశంలో రాజకీయ పార్టీలను ఐక్యం చేయడంలో కీలకపాత్ర వహించారన్నారు. బూర్జువా పాలకులతో సామాన్యమైన ప్రజలకు కావలసిన పథకాలు ఉమ్మడి ప్రణాళికలో ఏర్పాటు చేయడంలో ఏచూరి చేసిన కషి మరువ లేనిదన్నారు. నూతన ఆర్థిక విధానాలు మీద ఆయన తయారు చేసిన డాక్యుమెంట్ నేటికి ఆదర్శం అన్నారు. పాలకులు అనుసరిస్తున్న ప్రస్తుత ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు ముందుకు తీసుకెళ్లడమే మన ముందున్న కర్తవ్యమన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు, టి వి రమణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బొబ్బిలి : సిపిఎం జాతీయ పూర్వ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి స్ఫూర్తితో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు కోరారు. శుక్రవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో ఏచూరి వర్ధంతి సభను నిర్వహించి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్.గోపాలం, సభ్యులు యుగంధర్, వాసు, ప్రసాద్, కార్మికులు పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా శనివారం జాతీయ లోక్‌అదాలత్ జరుగుతుందని ప్రధాన న్యాయమూర్తి బబిత తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 19 లోక్ అదాలత్ బెంచీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాజీ పడదగిన క్రిమినల్ కేసులను, మోటార్ ప్రమాద భీమా కేసులు, బ్యాంకు కేసులు, చెక్కు బౌన్స్ కేసులు, మనీ కేసులు, ప్రామిసరీ నోట్ కేసులు, ఎక్సైజ్ కేసులు, భూమి తగాదా కేసులు, కుటుంబ తగాదాలు వాటర్ కేసులు, మరియు ప్రీ లిటిగేషన్ కేసులు, ఇరు పార్టీల అనుమతితో రాజీ మార్గంలో శాశ్వత పరిష్కారం చేసుకోవచ్చని కక్షిదారులు, ప్రజలు రేపు జరగబోయే జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగపరచుకోవాలని న్యాయమూర్తి తెలిపారు.

14 న జూనియర్ కబడ్డీ జట్టు ఎంపిక

విజయనగరం టౌన్ : ఈ నెల 23 నుంచి 25 తేదీ వరకు కృష్ణా జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ ఛాంపియన్ షిప్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక 14 తేదీ ఆదివారం స్థానిక రాజీవ్ క్రీడా మైదానంలో జరుగుతుందని జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ ఐ వి పి రాజు, అధ్యక్ష, కార్యదర్శులు రంగారావు దొర, కె వి ప్రభావతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలకు వచ్చే క్రీడాకారులు 1.1.2006 తర్వాత పుట్టిన వారై ఉండాలన్నారు. బాలురు 75 కేజీలు, బాలికలు 65 కేజీల బరువు లోపు ఉండాలన్నారు. ఎంపికలకు హాజరైన వారు ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు స్థానిక రాజీవ్ క్రీడా మైదానంలో హాజరు కావాలని తెలిపారు.

ఘనంగా పైడితల్లమ్మ పందిరిరాట

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

పైడితల్లి అమ్మవారి పందిరిరాట మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ముందుగా అమ్మవారి చదురుగుడి వద్ద ముహూర్త సమయానికి పందిరిరాట వేశారు. అనంతరం రైల్వే స్టేషన్ సమీపంలోని వనంగుడి వద్ద కూడా ఈ మహోత్సవాన్ని నిర్వహించారు. దీంతో అమ్మవారి సిరిమాను సంబరాలకు శ్రీకారం చుట్టినట్టయింది. ఈ కార్యక్రమంలో విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసుల నాయుడు, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.శిరీష, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకట్రావు పాల్గొన్నారు.



పందిరిరాట వేస్తున్న ఎమ్మెల్యే అదితి, ఎమ్మెల్సీ గాదె

రూ.1.8 కోట్లతో అభివృద్ధి పనులు : ఎమ్మెల్యే

పైడితల్లి అమ్మవారి ఆలయ విస్తరణ పనులను అమ్మవారి జాతర అయిపోయిన వెంటనే ప్రారంభించి, వచ్చే ఏడాది పండగ నాటికి పూర్తి చేస్తామని ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ సుమారు రూ.కోటి 80 లక్షలతో ఈ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఈ పనులకు టెండర్లను పిలవడం జరిగిందని, చండీయోగం ముగిసిన వెంటనే పనులను ప్రారంభిస్తామని చెప్పారు. ఈ ఏడాది కూడా భక్తులకు ఉచిత దర్శన అవకాశాన్ని కల్పిస్తున్నామని చెప్పారు.



యూరియా కోసం బారులు తీరిన రైతులు

రైతులకు యూరియా కష్టాలు

ప్రయివేట్ దుకాణాల వద్ద బారులు

ప్రజాశక్తి- సంతకవిటి

సంతకవిటి మండలంలోని చిన్న, సన్నకారుల రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. శుక్రవారం ఉదయాన్నే మండలంలోని ప్రయివేటు ఎరువుల దుకాణానికి 25 మెట్రిక్ టన్నుల యూరియా రావడంతో ఒక్కసారిగా రైతులు తరలివచ్చారు. యూరియా కోసం దుకాణం వద్ద రైతుల మధ్య తోపులాట జరగడంతో పోలీసుల సమక్షంలో పంపిణీ చేశారు. రైతులు గంటల తరబడి ఎండలోని ఎండుతూ... వానలో తడుస్తూ క్యూలో నిల్చున్నారు. దుకాణానికి లారీతో వచ్చిన యూరియా బస్తాలు అక్కడికక్కడే ఖాళీ అయిపోయాయి. కొంతమంది రైతులకు యూరియా దొరక్కపోవడంతో చివరికి నిరాశతో వెనుదిరిగారు.

జిల్లాలోని వరి సాగులో సంతకవిటి మండలం మొదటి స్థానంలో ఉంది. గతేడాది కంటే ఈ ఏడాది యూరియా కొరత ఎక్కువగా ఉంది. మండలంలోని 24 రైతు సేవా కేంద్రాల నుంచి పూర్తిస్థాయిలో యూరియా సరఫరా చెయ్యకపోవడంతో ప్రయివేట్ దుకాణాల వద్ద రైతుల తాకిడి మరింత ఎక్కువ అయింది. ప్రయివేటు ఎరువుల దుకాణాల వద్ద రైతులు నానా అవస్థలు పడుతున్నారు. అధికారులు యూరియా సమస్య లేదని ప్రకటనలు చేస్తున్నా, నిత్యం ఏదో ఒకచోట యూరియా సమస్యపై ఆందోళన తలెత్తుతోంది. యూరియా లేక వరిసాగు ఎండిపోతోందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు స్థానిక పిఎసిఎస్‌కు 420 యూరియా బస్తాలు వచ్చాయని రైతులు చెబుతున్నారు. ఆ యూరియాను ఎప్పుడు పంపిణీ చేస్తారని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. అయితే, పిఎసిఎస్ నుంచి రైతులకు ఎటువంటి సహకారమూ లేదని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. అయితే పిఎసిఎస్‌కు వచ్చిన యూరియా రైతులకు పంపిణీ చేస్తారా? లేక పక్కదారికి పట్టిస్తారా..? ఇక వేచిచూడాలి మరి!!.

చెరువుకు గండి

తాత్కాలికంగా పూడ్చివేసిన రైతులు

ప్రజాశక్తి-రేగిడి

మండలంలోని సంకిలి గ్రామ సమీపంలోని ఊట చెరువుకు శుక్రవారం గండి పడింది. గురువారం పడిన భారీ వర్షానికి ఊట చెరువులో నీరు భారీగా చేరడంతో చెరువు గండి పడింది. దీంతో నీరు వృథాగా పోతోంది. ఈ ఊట చెరువు సుమారు 200 ఎకరాలకు సాగునీరు అందిస్తోంది. ఆయకట్టు రైతులు కర్రి రమణ గండిని గుర్తించి రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. విఆర్ఒ దుర్గారావు రైతుల సహాయంతో తాత్కాలికంగా గండిని పూడ్చారు. మట్టి, ఇసుక బస్తాలు వేసి తాత్కాలికంగా చెరువు నీరు వృథా కాకుండా ఆపగలిగారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి పూర్తిస్థాయిలో గండిని పూడ్చేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



ఊట చెరువుకు పడిన గండి

స్టోన్ క్రషర్‌ను నిలిపేయండి

- సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని
- తహశీల్దార్ కార్యాలయం ముట్టడి



ఆందోళన చేస్తున్న వారినుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

ప్రజాశక్తి - శృంగవరపుకోట

జామి మండలంలోని మాధవరాయ మెట్ట కాలనీ ప్రజల ప్రాణాలను హరించే స్టోన్ క్రషర్‌ను తక్షణమే నిలుపుదల చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం జామి తహశీల్దార్ కార్యాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యాన ఆ కాలనీవాసులు ఆందోళన చేపట్టారు. తొలుత జామి బస్టాండ్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీగా వెళ్లి, కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ క్రషర్ దుమ్ము, ధూళి వల్ల కాలనీలో ఇప్పటికే 11 మంది కిడ్నీ వ్యాధి బారిన పడి మరణించారని తెలిపారు. మరో 9 మంది వ్యాధి బారిన పడినట్లు వైద్యులు నిర్ధారించారని తెలిపారు. అయినా అధికారులకు పట్టడం లేదని, కాంట్రాక్టర్‌కు అనుకూలంగా కాగితాలు రాస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పటికైనా అక్రమ క్వారీలు, బ్లాస్టింగులు నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గాడి అప్పారావు, న్యాయవాది బి.వి రమణారావు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

తహశీల్దార్ ఎదుట చర్చలు

అనంతరం తహశీల్దార్ ఎదుట చర్చలకు క్వారీ యజమాని ఎటువంటి కాగితాలు లేకుండా రావడంతో అధికారుల ఎదుట తెల్లమొహం వేశారు. రెండు రోజుల్లో అనుమతులు చూపిస్తామని తహశీల్దార్‌కు చెప్పి, అక్కడ నుంచి వెనుదిరిగారు. ఈ చర్చల్లో ఎస్ఐ వీరజనార్దన్, న్యాయవాది రమణారావు, సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

పెట్రోల్, డీజిల్ కల్తీ

వాహన చోదకుల ఆందోళన

ప్రజాశక్తి - చీపురుపల్లి

చీపురుపల్లి పట్టణంలోని రెసిడెన్షియల్ స్కూల్‌కు ఎదురుగా ఉన్న పెట్రోల్ బంకులో కల్తీ డీజిల్, పెట్రోల్ అమ్మకాలు చేపట్టడంపై వాహనచోదకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్రోల్, డీజిల్‌లో నీరు ఎక్కువగా ఉండటంతో గురువారం రాత్రి ఆందోళనకు దిగారు. పెట్రోల్ బంక్ నిర్వాహకులు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. స్థానిక పోలీసులు.. బంక్ నిర్వాహకులను స్టేషన్‌కి తీసుకువెళ్లడంతో తాత్కాలికంగా పరిస్థితి సద్దుమణిగింది. అప్పటికే నింపిన పెట్రోల్, డీజిల్ కారణంగా తమ వాహనాలు మరమ్మతులకు గురయ్యే ప్రమాదం ఉందంటూ శుక్రవారం ఉదయం వాహన చోదకులు బంకు యాజమాన్యాన్ని నిలదీశారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో నివేదికను సిఐకు సమర్పించినట్లు ఎస్ఐ దామోదరరావు తెలిపారు. మరోవైపు పెట్రోల్ బంక్ వద్ద కనీస నియమాలు పాటించడం లేదని వాహనచోదకులు చెబుతున్నారు.



బంకులో తనిఖీలు చేస్తున్న తహశీల్దార్ ధర్మరాజు

కఠిన చర్యలు తీసుకుంటాం

పెట్రోల్ బంక్‌లో కనీస నియమాలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ డి.ధర్మరాజు.. నిర్వాహకులను హెచ్చరించారు. శుక్రవారం ఉదయం పెట్రోల్ బంక్‌ను ఆయన తనిఖీ చేశారు. పెట్రోల్, డీజిల్ కల్తీ చేస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని యాజమాన్యాన్ని హెచ్చరించారు.

కలెక్టర్ అంబేద్కర్‌కు ఘనంగా వీడ్కోలు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా వీడ్కోలు పలికారు. జిల్లా నుంచి బదిలీ అయిన నేపథ్యంలో శుక్రవారం కలెక్టర్ అంబేద్కర్ తమ విధుల నుంచి వైదొలిగారు. పలువురు జిల్లా అధికారులు, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో రెవెన్యూ అసోసియేషన్ నాయకులు, పలుశాఖల అధికారులు, ఉద్యోగులు సిబ్బంది కలెక్టర్‌ను ఛాంబర్లో కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. శాలువలతో సత్కరించారు. పలువురు ప్రజా ప్రతినిధులు కూడా కలెక్టర్ ను కలిసి అభినందించారు.



కలెక్టర్‌ను సత్కరిస్తున్న అధికారులు

యూరియా సమస్య తీరేదెప్పుడు?

మండల సమావేశంలో సభ్యుల గరం.. గరం



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

ప్రజాశక్తి - గరివిడి

మండలంలోని రైతులు యూరియా కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం గరివిడి మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపిపి మీసాల విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. యూరియా అరకొర సరఫరా వల్ల రైతులు నానా అవస్థలు పడుతున్నారనితాటిగూడ పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు ఎడ్ల అప్పారావు, బొండపల్లి సర్పంచ్ స్వప్న, వెదుల్లవలస సర్పంచ్ తమ్మినాయుడు, కాపుశంభం ప్రతినిధి లెంక శ్రీరాములు.. వ్యవసాయ శాఖ అధికారులను నిలదీశారు. ఎడి కోటేశ్వరరావు, ఎఒ పక్కి ప్రసాదరావు స్పందిస్తూ రైతులకు అవసరమైన యూరియా సహా ఎరువులు త్వరలోనే అందుబాటులోకి వస్తాయని తెలిపారు. మూడేళ్లుగా డ్వాక్రా మహిళల రూ.42 లక్షల భాగస్వామ్యంతో నడుస్తున్న మహిళా మార్ట్ నష్టాల్లో మునిగిపోతుండగా, ఇప్పటివరకు దిద్దుబాటు చర్యలు చేపట్టలేదని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎపిఎం ధనలక్ష్మి మాట్లాడుతూ ఆడిట్ నివేదికల అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాలతో తగు చర్యలు తీసుకుంటామన్నారు.

గరివిడి ఎంపిటిసి ఎడ్ల సూర్యారావు మాట్లాడుతూ ఫ్లైఓవర్‌పై ప్రమాదాల కారణంగా శిథిలమైన రక్షణ గోడలను, గర్భాం రోడ్డు వైపు అధ్వానంగా ఉన్న రహదారిని వెంటనే మరమ్మతు చేయాలని కోరారు. ఆర్అండ్‌బి ఎఇఇ జార్జ్ వెస్లీ స్పందిస్తూ బ్రిడ్జి డైవర్షన్ రోడ్లు, గర్భంరోడ్ మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయని, త్వరలో పనులు పూర్తి చేస్తామని తెలిపారు. రూ.2.14 కోట్ల ఉపాధి బిల్లులు పెండింగ్ ఉన్నాయని, ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే చెల్లిస్తామని ఎపిఒ వెల్లడించారు. ఈ సందర్భంగా తమకు తెలియకుండా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని పలువురు సభ్యులు ప్రస్తావించగా, జెడ్‌పిటిసి వాకాడ శ్రీనివాసరావు, ఎఎంసి మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు స్పందించి, ఆయా గ్రామాల్లో సర్పంచులు, ఎంపిటిసిలకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమావేశంలో ఎఎంసి చైర్మన్ రామారావు, వైస్ ఎంపిపిలు గుడివాడ శ్రీరాములనాయుడు, రామకృష్ణంరాజు, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ మధుసూదన్‌రావు, తహశీల్దార్ సిహెచ్ బంగార్రాజు, ఐసిడిఎస్ పిఒ ఆరుద్ర, ఎంఇఒ పి.రామారావు, అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రా భవన్ వద్ద జిందాల్ నిర్వాసితుల ఆందోళన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఢిల్లీలోని ఆంధ్రా భవన్ వద్ద అంబేద్కర్ విగ్రహ కూడలిలో శుక్రవారం జిందాల్ నిర్వాసితులు ఆందోళన నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలోని పాలకులు గానీ, అధికారులు గానీ పట్టించుకోకపోవడంతో ఢిల్లీ వచ్చి నిరసన చేపట్టామని ఎమ్మెల్సీ రఘురాజు తెలిపారు. జిందాల్ పరిశ్రమకు సేకరించిన భూములను నిర్వాసితులకు వెంటనే తిరిగి ఇవ్వాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చల్లా జగన్, నిర్వాసితులు పాల్గొన్నారు.

115 డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో

రూ.11.50 లక్షల జరిమానా

ప్రజాశక్తి -కంటోన్మెంట్

మద్యం సేవించి వాహనాలు నడిపి, పట్టుబడిన 115 మంది వాహనదారులు ఒక్కొక్కరికి రూ.10వేలు జరిమానాను విజయనగరం అడిషనల్ జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎం.ఎస్.హెచ్.ఆర్.తేజ చక్రవర్తి విధించారని ఎస్‌పి వకుల్‌జిందాల్ తెలిపారు. ఎస్‌పి ఆదేశాలతో విజయనగరం ట్రాఫిక్ సిఐ సూరినాయుడు ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టి, మద్యం సేవించి, వాహనాలు నడిపిన వారిపై 115 కేసులు నమోదు చేసి, విజయనగరం అడిషనల్ జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వద్ద హాజరుపరిచారని తెలిపారు. మెజిస్ట్రేట్ ఎం.ఎస్. హెచ్.ఆర్.తేజ చక్రవర్తి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున మొత్తం 115 మందికి రూ.11.50 లక్షలను జరిమానాగా విధించారని తెలిపారు.

పోతయ్యపాలెంలో నవోదయం

ప్రజాశక్తి-డెంకాడ

అదో మారుమూల కుగ్రామం. విజయనగరం జిల్లా కేంద్రానికి 10 కిలోమీటర్ల దూరంలో ఉంది. పూర్తిగా రోడ్డు సౌకర్యం లేని గ్రామీణ ప్రాంతమిది. ఆ గ్రామంలో సుమారు 100 కుటుంబాలు జీవిస్తుంటే, అంతా గొర్రెలు, మేకల పెంపకందారులే. ఆ గ్రామంలో పదో తరగతి పైన చదివిన వారిని వేళ్లపైనే లెక్కపెట్టొచ్చు. పది పూర్తయిందా.., వ్యవసాయ, కూలీ పనులకు పరిమితం. అంతలా వెనుకబడింది ఆ గ్రామం. అలాంటి గ్రామం.. నవోదయాన్ని చూసింది. కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టింది. నూతన శకానికి నాంది పలికింది. ఇంతకీ ఏం జరిగింది అంటారా..?



బిఎస్ఎఫ్‌లో ఉద్యోగం సాధించిన శివను అభినందిస్తున్న గ్రామస్తులు

డెంకాడ మండలంలోని చొల్లంగిపేట పంచాయతీ పరిధిలోని కుగ్రామం.. పోతయ్యపాలెం. ఇక్కడున్న ప్రాథమిక పాఠశాలలోనే గ్రామస్తులు పిల్లలను ఐదో తరగతి వరకు చదివిస్తారు. అనంతరం మండల కేంద్రం డెంకాడలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు వారి విద్యాభ్యాసం సాగుతుంది. గ్రామస్తులంతా గొర్రెలు, మేకల పెంపకందారులే కావడంతో పదో తరగతి చదివాక పిల్లలను వ్యవసాయ, వివిధ రకాల పనులకు పంపిస్తుంటారు. ఈ గ్రామంలో ఉన్నత చదువులు చదివిన వారు చాలా తక్కువ. అలాంటి గ్రామంలో ఇటీవల సారిపల్లి శివ, లండా దేవికలకు ప్రభుత్వఉద్యోగాలు వచ్చాయి. దీంతో ఆ గ్రామం మొత్తం ఉబ్బితబ్బిబ్బవుతోంది. గ్రామస్తులంతా ఆ గ్రామంలోని పాఠశాలలోనే ఉపాధ్యాయులతో కలిసి శుక్రవారం వారిని ఘనంగా సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.రాంబాబు, ఉపాధ్యాయులు ఆర్‌విఆర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు.

ఇటీవల భారత ప్రభుత్వం చేపట్టిన దేశభద్రత సంబంధించిన నియామకాలలో భాగంగా బిఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా సారిపల్లి శివ ఉద్యోగం పొంది, అగర్తలాలో విధులు నిర్వహిస్తున్నారు. డిఎస్‌సి నియామకాల్లో లండ దేవిక ఉపాధ్యాయ ఉద్యోగం సాధించారు. వీరిద్దరి విద్యాభ్యాసం అంతా స్థానిక ప్రభుత్వ బడిలోనే కొనసాగింది. కనీసం రోడ్డు సౌకర్యం లేని గ్రామమైన పోతయ్యపాలెంలో తొలిసారిగా యువత ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి, అందరికీ ఆదర్శంగా నిలిచారని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సచివాలయ భవనం ప్రారంభం

ప్రజాశక్తి-శృంగవరపుకోట


సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న జెడ్‌పి చైర్మన్

మండలంలోని వసి సచివాలయ నూతన భవనాన్ని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి వెంకటలక్ష్మి, సర్పంచ్ బంగారునాయుడు, వైస్ ఎంపిపి పినిశెట్టి రమణ, నాయకులు మోపాడ కుమార్, వాకాడ రాంబాబు, పోతనపల్లి సర్పంచ్ వెంకట్రావు పాల్గొన్నారు.

రైతుబజార్ నిర్మాణానికి చర్యలు

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలోని డిసిఎంఎస్ స్థలంలో రైతు బజార్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బేబినాయన ఎఎంసి పాలకవర్గాన్ని ఆదేశించారు. స్థానిక కోటలో శుక్రవారం ఎఎంసి చైర్మన్ నర్సుపల్లి వెంకటనాయుడు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు బజార్ ఏర్పాటుకు, మార్కెట్ యార్డు ప్రహరీ, గోదాములను బాగు చేసేందుకు ప్రతిపాదనలు చేయాలన్నారు. ఆదాయం పెంచేలా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. తెర్లాంలో గోదాములు, రామభద్రపురంలో సబ్ మార్కెట్ యార్డు నిర్మాణానికి, వ్యవసాయ శాఖ ఎడి కార్యాలయ భవనాన్ని బాగు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఇఎస్ఐసిపై అవగాహన

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలోని అభ్యుదయ పాఠశాలలో శుక్రవారం ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్సు కార్పొరేషన్ డిప్యూటీ డైరెక్టర్ ఇన్‌ఛార్జి సౌమేంద్ర కుమార్ సాహూ, అసిస్టెంట్ డైరెక్టర్ వి.శ్యామ్‌ప్రసాద్, స్థానిక ఇఎస్ఐ డిస్పెన్సరీ ఇన్‌ఛార్జి మెడికల్ ఆఫీసర్ మానస, సోషల్ సెక్యూరిటీ ఆఫీసర్ జి.జీవరత్నం ఇఎస్ఐసి వినియోగంపై అవగాహన కల్పించారు. ఇఎస్ఐసి నెలవారీ కడితే కలిగే ఉపయోగాలను వివరించారు. ఇప్పటి వరకు ఇఎస్ఐలో నమోదు కాని కర్మాగారాలు, సంస్థలు ఈ సమయంలో నమోదు చేస్తే వారు ప్రకటించిన తేదీ నుండి మాత్రమే చందా కట్టవచ్చు. పూర్వపు కాలం బకాయిలు, పెనాల్టీల నుండి మినహాయింపు ఇస్తామని తెలిపారు. 1.7.2025 నుండి 31.12.2025 వరకు ఈ పథకం అమలులో ఉంటుందన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అభ్యుదయ విద్యాసంస్థల కరెస్పాండెంట్ ఎంకె నాయుడు, స్థానిక ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాల్స్, యాజమాన్యాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రతి శుక్రవారం డ్రైడే పాటించే విధంగా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని హెల్త్ సెక్రటరీలకు, శానిటరీ సెక్రటరీలకు కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. శుక్రవారం సచివాలయాల వారీగా సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఫ్రైడే డ్రైడే పాటించేలా అవగాహన పరుస్తూ దోమలు నిల్వ ఉన్న కేంద్రాలను తొలగించారు. ఇంటింటి ఫీవర్ సర్వే చేపడుతూ అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన ర్యాలీ చేపట్టారు. దోమతెరలు కట్టుకోవడంతో పాటు, ఏంటి లార్వా విధానాలను పాటించాలన్నారు.

ఉద్యోగోన్నతి ఉత్తర్వులు అందజేత

ప్రజాశక్తి- కంటోన్మెంట్

బొండపల్లి హైస్కూల్లో రికార్డు అసిస్టెంట్ ఎస్.షఫీకి జూనియర్ సహాయకులుగా ఉద్యోన్నతి కల్పిస్తూ జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు శుక్రవారం నియామక ఉత్తర్వులు అందించారు. కార్యక్రమంలో సిఇఒ బివి సత్యనారాయణ, డిప్యూటీ సిఇఒ ఆర్.వెంకట్‌రామన్, ఎఒ రాజేశ్వరి పాల్గొన్నారు.

బిసిల రక్షణ చట్టం అమలెక్కడ?

ప్రజాశక్తి- కంటోన్మెంట్


వినతి అందిస్తున్న బిసి సంక్షేమ సంఘం నాయకులు

బిసిల ప్రత్యేక రక్షణ చట్టం తెస్తామని కూటమి ప్రభుత్వం లిచ్చిన ఆ హామీని అమలు చేయాలని బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు గదులు వెంకటరావు కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో డిఆర్ఒ శ్రీనివాస మూర్తికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్న బిసిలకు ఎస్సీ, ఎస్టీల మాదిరిగా ప్రత్యేక రక్షణ చట్టం తెస్తామని ఎన్నికల వాగ్దానం చేశారన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఆ ఊసే ఎత్తడ లేదన్నారు. రాష్ట్రంలో కులగణను సమగ్రంగా నిర్వహించకుండా, స్థానిక ప్రాదేశిక నియోజకవర్గం విభజన పూర్తి చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలను ఎలా నిర్వహిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గొర్లె సూరిబాబు, జిల్లా ఉపాధ్యక్షులు తోటపల్లి బుజ్జిబాబు, నాయకులు సబ్బి నాగేశ్వరరావు, దువ్వు వేణు, అలమూరు సత్యనారాయణ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బానాది పంచాయతీ కార్యదర్శిగా మూర్తి

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బానాది పంచాయతీ కార్యదర్శి కార్యదర్శి ఎఎస్ఎస్ఎన్ మూర్తి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శుల బదిలీల కారణంగా సుమారు మూడు నెలలుగా ఆ స్థానం ఖాళీగా ఉంది. దీంతో సచివాలయంలో పనులకు కొంత ఇబ్బందిగా మారింది. ఎట్టకేలకు గతంలో బదిలీపై వెళ్లిన పంచాయతీ కార్యదర్శి ఎఎస్ఎస్ఎన్ మూర్తి బాధ్యతలు స్వీకరించారు.

వాహనమిత్రకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-వేపాడ

వాహనమిత్ర పథకానికి ఆటో, మ్యాక్సీ, క్యాబ్ డ్రైవర్ల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17 నుంచి 19 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని చెప్పారు. 22లోగా క్షేత్రస్థాయి పరిశీలన ఉంటుందని తెలిపారు. ఈ నెల 24నాటికి తుదిజాబితాను సిద్ధం చేస్తామని వెల్లడించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మున్సిపల్ అధికారులను సస్పెండ్ చేయాలి


ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం కంటోన్మెంట్ లో ఆవు మాంసం అమ్ముకోవడానికి లైసెన్స్ లు మంజూరు చేసిన మున్సిపల్ అధికారులను సస్పెండ్ చేయాలని ఆంధ్రప్రదేశ్ గో సంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు లోగిశ రామకృష్ణ అన్నారు. శుక్రవారం జరిగిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. పలుమార్లు మున్సిపల్ హెల్త్ అధికారులను, కమిషనర్ ను కోరినప్పటికీ వారు ఆవు మాంసం విక్రయదారుల తో కుమ్మక్కై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో గోసంరక్షణ సమాఖ్య పట్టణ మహిళా అధ్యక్షురాలు తాలాడ పైడిరాజు, కార్యదర్శి బి.సంధ్యారాణి పాల్గొన్నారు.

పేదలకు అండగా సిఎంఆర్ఎఫ్

ప్రజాశక్తి-బొబ్బిలి

సిఎం సహాయ నిధి పేదలకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. కోటలో శుక్రవారం 36 మందికి సిఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. 36 మందికి రూ.19,85,885 మంజూరైనట్లు ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్ పాల్గొన్నారు.


సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

రెవెన్యూ సేవల్లో విఫలం

అధికారుల తీరుపై సభ్యుల ఆగ్రహం

ప్రజాశక్తి- వంగర



సిఎస్ డిటి పిన్నింటి రామారావును నిలదీస్తున్న వైస్ ఎంపిపి ఉమామహేశ్వరరావు

ప్రజలకు సేవలు అందించడంలో రెవెన్యూ శాఖ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ, వైస్ ఎంపిపి కిమిడి ఉమామహేశ్వరరావు, ఎంపిటిసి కరణం సుదర్శన రావు ధ్వజమెత్తారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి సురేష్ అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. రెవెన్యూ శాఖలో ఏ పని కావాలన్నా లంచం ఇస్తే తప్ప చేయడం లేదని సభ్యులు మండిపడ్డారు. మండలంలో రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందని ఆగ్రహం వ్యక్తంచేశారు. మూడు నెలలకోసారి జరిగే సర్వసభ్య సమావేశానికి తహశీల్దార్ హాజరు కాకపోవడంపై సభ్యులు విరుచుకుపడ్డారు. డిటి శ్రీనివాసరావు మాట్లాడుతూ పూర్తిస్థాయి తహశీల్దార్ లేక కొంత ఇబ్బంది కలుగుతోందన్నారు. రేషన్ బియ్యం పంపిణీలో తరుగు వస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని వైస్ ఎంపిపి ఉమామహేశ్వరరావు.. సిఎస్ డిటి పిన్నింటి రామారావును నిలదీశారు. మరోవైపు ప్రభుత్వ వైద్య సేవలు సక్రమంగా అందక పోవడంతో ప్రయివేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారని, దీనివల్ల ప్రజలు నష్టపోతున్నారని వైస్ ఎంపిపి తెలిపారు. ఎంపిపి, గీతనాపల్లి సర్పంచ్ మాట్లాడుతూ తల్లికి వందనం పథకం డబ్బులు పడక పోవడంతో చాలామంది గగ్గోలు పెడుతున్నారని, ఆ శాఖ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం సరికాదని నిలదీశారు.

యూరియా అరకొరగా అందుతోందని సభ్యులు లేవనెత్తగా, ఎంపిపి, ఎఒ కన్నబాబు మాట్లాడుతూ మరో 40 టన్నుల యూరియా వస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ ఎస్.రఘునాథ చారి, డిప్యూటీ ఎంపిడిఒ కెల్ల రామారావు, ఎంఇఒ మీసాల కూర్మినాయుడు, ఆర్ఐ బోనెల రామారావు, తదితరులు పాల్గొన్నారు.

బాలికా విద్యకు ప్రాధాన్యత

ప్రజాశక్తి-బాడంగి


సైకిళ్లను పంపిణీ చేస్తున్న కెనరా బ్యాంకు అధికారులు, వికె ఫౌండేషన్ ప్రతినిధులు

బాలికా విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు కెనరా బ్యాంకు డిజిఎం ఎపి రావు, ఆర్ఒ కె.వినోద్ తెలిపారు. శుక్రవారం బాడంగి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుండి 10 వరకు చదువుతున్న తల్లిదండ్రులు లేని బాలికలకు వికె ఫ్యామిలీ ఫౌండేషన్, కెజిబి సర్వీసెస్, కెనరా బ్యాంకు సమకూర్చిన సైకిళ్లు, ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. వికె ఫ్యామిలీ ఫౌండేషన్ సహకారంతో కేజీబి సర్వీసెస్ సమకూర్చిన నిధులతో 100 మంది బాలికలకు ఒక్కొక్కరికి నెలకు రూ.వెయ్యి చొప్పున డిగ్రీ పూర్తయ్యే వరకు ఉపకార వేతనాలను అందించనున్నారు. కెనరా బ్యాంకు సిఎస్ఆర్ నిధులతో మరో 100 మంది బాలికలకు సైకిళ్లను అందజేశారు. వీటిని కెనరా బ్యాంకు అధికారులు, డిప్యూటీ డిఇఒ మోహనరావు పంపిణీ చేశారు. వికె ట్రస్ట్ ప్రతినిధి మాదల ప్రతాప్ మాట్లాడుతూ బాడంగిలో వికె ఫౌండేషన్ కార్యక్రమాలు కొల్లి ఈశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిభ ఆధారం గానే విద్యార్థుల ఎంపిక చేపట్టినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో మరింత మందికి సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో కెనరా బ్యాంకు సీనియర్ మేనేజర్ రాజ్యలక్ష్మి, గోపాలకృష్ణ, వికె ట్రస్ట్ డైరెక్టర్ సాన సత్యకుమార్, జెడ్‌పిటిసి పెద్దింటి రామారావు, ఎంపిటిసి దేవరాపల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ కండి రమేష్, ఎంఇఒ లక్ష్మణదొర, ప్రధానోపాధ్యాయులు పూజారి హరిప్రసన్న, వేణుగోపాలరావు, దత్తి సత్యనారాయణ, పొట్నూరు శివాజీ, ప్రత్యేక ఉపాధ్యాయుడు కొల్లి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తి అలవర్చుకోవాలి


కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

ప్రజాశక్తి-రేగిడి

విద్యార్థి దశ నుంచే క్రీడా స్ఫూర్తి అలవర్చుకోవాలని ఎంపిడిఒ శ్యామలకుమారి, ఎంఇఒ ఎం.వరప్రసాదరావు అన్నారు. పనసలవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి అండర్-14, 17 ముగింపు క్రీడా పోటీలను నిర్వహించారు. బాలుర కబడ్డీ, ఖో ఖో, వాలీబాల్, బాడ్మింటన్, యోగా, చెస్, అథ్లెటిక్స్‌లో పోటీలు నిర్వహించి విజేతలను ప్రకటించారు. వీరిని డివిజన్ స్థాయి క్రీడా పోటీలకు పంపించనున్నట్లు ఎంఇఒ తెలిపారు. ఈకార్యక్రమంలో ఇఒపిఆర్‌డి జగన్నాధరావు, ప్రధానోపాధ్యాయులు బి.సునీత, మండల క్రీడాధికారి ఎన్ సత్యనారాయణ, నాయకులు గేదెల గోవిందరావు, కడగల నాగరాజు, బోడినాయుడు, నర్సునాయుడు, వ్యాయామ ఉపాధ్యాయులు కె .కోటి చక్రధర్, ఎం.రామకృష్ణనాయుడు, కె.రామచంద్రుడు, ఎం.గణనాథ, కార్యదర్శి బి.రాము పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కొండగుంపాం విద్యార్థి

నెల్లిమర్ల : రాష్ట్ర స్థాయి అండర్-17 వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు కొండగుంపాం హైస్కూల్ విద్యార్థి పతివాడ ధన దీక్షిత ఎంపికైంది. 55 కిలోల విభాగంలో జిల్లా స్థాయిలో దీక్షిత సత్తాచాటింది. దీక్షితను ఎస్ఎంసి చైర్మన్ పతివాడ శంకర్రావు, ప్రధానోపాధ్యాయులు వి.వేణుగోపాల్‌రావు, పిఇటి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

చందులూరి విద్యార్థుల సత్తా

లక్కవరపుకోట : ఎస్‌జిఎఫ్ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు చందులూరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు భూమిరెడ్డి కావ్య, కిలపర్తి లావణ్య, కె.రుచిత, సిహెచ్ దేవేంద్ర ఎంపికయ్యారు. వీరిని శుక్రవారం హెచ్ఎం ఎస్.రామకృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు.

జూడో, లాన్ టెన్నిస్, కరాటే జట్లు ఎంపిక

విజయనగరం టౌన్ : ఆరికతోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జూడో అండర్ 14, 17 జట్ల ఎంపికలు శుక్రవారం నిర్వహించారు. స్థానిక విజ్జి మైదానంలో లాన్ టెన్నిస్, కరాటే జిల్లా పోటీలు, జట్లు ఎంపికలు జరిగాయి. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షులు ఎన్.వెంకట్ నాయుడు, పీడీ రత్న కిషోర్ సమక్షంలో ఈ ఎంపికలు జరుగాయి. వ్యాయామ ఉపాధ్యాయులు కృష్ణంరాజు , పాప సంఘ సభ్యులు లక్ష్మణ్ అప్పారావు, పీడీ మహేష్, స్కూల్ గేమ్స్ కార్యదర్శులు గోపాల్, ఎస్.విజయలక్ష్మి తెలిపారు.

రాష్ట్ర పోటీలకు టెన్నికాయిట్ జట్లు

ఈనెల 13 నుండి 15 వరకు కాకినాడ జిల్లా మండపేటలో జరగబోయే ఆంధ్రప్రదేశ్ సీనియర్ టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొనేందుకు విజయనగరం జిల్లా స్త్రీ పురుషుల జట్లు శుక్రవారం బయలుదేరి వెళ్ళాయి. ఈ జట్లుకు జిల్లా కార్యదర్శి ఎం.రామారావు టీ షర్ట్‌లు పంపిణీ చేయగా జిల్లా అధ్యక్షులు ఎం.వెంకటేశ్వరరావు చేతుల మీదుగా క్రీడాకారులకు అందజేశారు.

పి-4పై గ్రామసభలు నిర్వహించాలి

ప్రజాశక్తి-గంట్యాడ


మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి ప్రమీల గాంధీ

బంగారు కుటుంబాలను గుర్తించడం కోసం ప్రతి పంచాయతీలో గ్రామసభలను నిర్వహించాలని నియోజకవర్గ ప్రత్యేక అధికారి ప్రమీల గాంధీ అన్నారు. శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి పీరుబండి హైమావతి ఆధ్వర్యంలో నిర్వహించిన పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సచివాలయ పరిధిలో ఇంటింటికి తిరిగి పి-4 సర్వే చేసి, బంగారు కుటుంబాలను గుర్తించాలన్నారు. అట్టడుగున ఉన్న పేదలను గుర్తించి జాబితాను తయారుచేసి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. ఎంపిపి హైమావతి మాట్లాడుతూ ఇంతవరకు చేసిన బంగారు కుటుంబాల సర్వేలో 75 శాతం తప్పులు ఉన్నాయని చెప్పారు. గ్రామసభలు సక్రమంగా నిర్వహించడం లేదన్నారు. దీనిపై స్థానికంగా కొంతమందికి అవగాహన లేకపోవడం వల్ల సర్వే పూర్తి కావడం లేదని చెప్పారు. సమావేశంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రాములమ్మ, డిప్యూటీ ఎంపిడిఒ విజయ్ కుమార్, బంగారు కుటుంబాల మండల కోఆర్డినేటర్ దివ్య, వైసిపి ఎస్‌సి సెల్ అధ్యక్షులు పి.జైహింద్ కుమార్ పాల్గొన్నారు.

ముమ్మరంగా చెరువుల సర్వే

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో చెరువుల వాస్తవ విస్తీర్ణ కొలతలు చేపట్టే ప్రక్రియ దాదాపుగా పూర్తికావచ్చిందని కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. ఆయన ఆదేశాలతో శుక్రవారం స్థానిక బుచ్చన్న కోనేరు విస్తీరణం కొలతలను ప్రణాళిక సిబ్బంది నమోదు చేశారు. మొత్తం 16 మంది ప్రణాళిక కార్యదర్శులు ఈ మేరకు బుచ్చన్న కోనేరు ప్రాంతాన్ని చేరుకుని చెరువు నలవైపులా కొలతలు తీసారు. గతంలో ఈ చెరువు తరచూ వర్షాకాలంలో ముంపునకు గురి అయ్యేది. చెరువు పునరుజ్జీవం అయిన తర్వాత కోనేటి అందాల అబ్బురపరిచాయి. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ నగరంలో చెరువులు కబ్జా కాకుండా అవసరమైన అన్ని చర్యలను చేపడుతున్నామన్నారు.

104ను ప్రభుత్వమే నిర్వహించాలి

ప్రజాశక్తి -కంటోన్మెంట్

104 సర్వీసులను ప్రభుత్వమే నిర్వహించాలని ఆ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.జగన్మోహన్ కోరారు. శుక్రవారం విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజుకు, డిఎంహెచ్ఒ ఎస్.జీవన్ రాణికి వినతిపత్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవ్య హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ తగ్గించిన జీతాల బకాయిలతో సహా ఇప్పించాలన్నారు. నిత్యవసర ధరలకు అనుగుణగా 104 ఉద్యోగులందరికీ వేతనాలు చెల్లించాలన్నారు. మాజీ యాజమాన్యం అరబిందో సంస్థ నుండి చట్టపరమైన చెల్లింపులను ఉద్యోగులకు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. డ్రైవర్, డిఇఒలకు ప్రభుత్వ శాఖల నియమకాల్లో వెయిటేజ్ ఇచ్చి ప్రాధాన్యత కల్పించాలన్నారు .చట్టప్రకారం కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఇవ్వాల్సిన క్యాజువల్ లీవులు పబ్లిక్ హాలిడేస్ గుర్తింపు కార్డులు పేస్లిప్పు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో 104 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు ఎ.రామరాజు, రవికేశ్వర రాజు, ఆర్ఎస్ నాయుడు, బంగారప్పడు, సంతోష్ కుమార్, గోవిందు, రాంబాబు పూడి కృష్ణ నాయుడు తదితరులు పాల్గొన్నారు

14న ఇపిఎఫ్ పింఛనుదారుల సదస్సు

ప్రజాశక్తి-నెల్లిమర్ల


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఈ నెల 14న ఇపిఎఫ్ పింఛనుదారుల సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం నాయకులు కిల్లంపల్లి రామారావు, మొయిద పాపారావు, కాళ్ల అప్పలసూరి, కనకల పద్మనాభం తెలిపారు. శుక్రవారం జరజాపుపేటలో నిర్వహించిన ఇపిఎఫ్ పింఛనుదారుల సమావేశంలో వారు మాట్లాడారు. నెల్లిమర్లలోని కార్మికుల అమర వీరుల భవనంలో నిర్వహించే సదస్సుకు ఇపిఎఫ్ పింఛనుదారుల సంఘం జిల్లా నాయకులు ఒఎస్ఎన్ మూర్తి, అంబళ్ల గౌరినాయుడు హాజరౌతారని, పింఛనుదారులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

కొనిసలో పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి - గజపతినగరం


పశువులకు తనిఖీలు చేస్తున్న డాక్టర్ అవినాష్

మండలంలోని కొనిస గ్రామంలో శుక్రవారం మరుపల్లి పశు వైద్యాధికారి అవినాష్ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 100కు పైగా పశువులకు పరీక్షలు నిర్వహించారు. 30 పశువులకు గర్భకోశ చికిత్సలు, మరో 15 పశువులకు చూడి తనిఖీలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది, గోపాలమిత్ర సత్యనారాయణ పాల్గొన్నారు.

రైతులకు శిక్షణ

ప్రజాశక్తి-కొత్తవలస

మండలంలోని చింతలపాలెంలో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త లక్ష్మణ్ ఆధ్వర్యంలో రైతులకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. 30 మంది రైతులకు జీవ ఎరువులు వంద శాతం సబ్సిడీతో అందచేశారు. కార్యక్రమంలో ఎఒ కెవి రాంప్రసాద్,ఉపసర్పంచ్ కనకేశ్వరరావు, ఎఇఒ గణేష్ , ఎంపిఇఒ కుమారి పాల్గొన్నారు.

వైసిపి హయాంలోనే తాగునీటి పథకం పనులు

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపాలిటీలో తాగునీరు అందించేందుకు ఎపియుఎఫ్ఐడిసి నిధులు రూ.90 కోట్లతో వైసిపి హయాంలో పనులు ప్రారంభించినట్లు మున్సిపల్ మాజీ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ తెలిపారు. స్థానిక వైసిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ తాగునీటి పథకానికి కేంద్ర ప్రభుత్వం గత టిడిపి హయాంలో నిధులు మంజూరు చేస్తే అప్పటి మంత్రి సుజయకృష్ణ రంగారావు నిర్లక్ష్యంతో పనులు ప్రారంభించలేదన్నారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి హయాంలో పనులు ప్రారంభించినట్లు చెప్పారు. పట్టణాభివృద్ధికి వైసిపి హయాంలో ఎంతో కృషి చేశామన్నారు. అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే బేబినాయన వ్యాఖ్యలను ఖండించారు. సమావేశంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్‌పర్సన్ జి.రమాదేవి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

తెలుగు ప్రజలకు అండగా లోకేష్ : నాగార్జున

ప్రజాశక్తి- చీపురుపల్లి

నేపాల్‌లో చిక్కుకున్న తెలుగు ప్రజలకు మంత్రి నారా లోకేష్ అండగా నిలిచారని డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. రాష్ట్రానికి చెందిన 215 మందికి నేపాల్‌లో రక్షణ కల్పించి నారా లోకేష్ మానవత్వాన్ని చాటుకున్నారని తెలిపారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి-వేపాడ


తనిఖీలు చేపడుతున్న విజిలెన్స్ సిఐ సింహాచలం

మండలంలోని ఎరువులు, పురుగుల మందుల దుకాణాల్లో శుక్రవారం విజిలెన్స్ సిఐ బి.సింహాచలం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎరువుల నిల్వలు, రికార్డులను పరిశీలించారు. అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని సిఐ హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఒ స్వాతి, ఎఇఒ అక్కునాయుడు, హెచ్‌సి కామేశ్వరరావు, పిసి పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

ఎస్.కోట పిఎసిఎస్ చైర్మన్‌గా జిఎస్ నాయుడు

ప్రజాశక్తి-శృంగవరపుకోట



శృంగవరపుకోట పిఎసిఎస్ అధ్యక్షులుగా టిడిపి మండల అధ్యక్షులు గొర్రిపాటి సింహాచలం నాయుడు నియమితులయ్యారు. తన నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, టిడిపి రాష్ట్ర నాయకులు కోళ్ల రాంప్రసాద్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యలపై వినతుల స్వీకరణ

ప్రజాశక్తి-డెంకాడ


వినతులు స్వీకరిస్తున్న మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు

మండలం లోని పోలిపల్లి గ్రామంలో మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు తన నివాసం వద్ద శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు, కార్యకర్తల నుంచి వినతులు స్వీకరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని నిర్ణీత గడువులోగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నేపాల్‌లో చిక్కుకున్న తెలుగు వారిని రాష్ట్రానికి తీసుకురావడంతో మంత్రి నారా లోకేష్ చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి పార్లమెంట్ ఉపాధ్యక్షులు ఆగిరి ప్రసాదరావు, నాయకులు మైలపల్లి సింహాచలం, దంగ భూలోకం, అవనాపు సత్యనారాయణ, కౌన్సిలర్ కళావతి, మగ్గం మోహన్ రావు, అజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆమె నేత్రాలు సజీవం

ప్రజాశక్తి- చీపురుపల్లి


సరస్వతి (ఫైల్)

'నేను మరణించిన తర్వాత నా కళ్లను వేరొకరికి దానం చేయండి. నా కళ్లతో మరికొందరు ఈ ప్రపంచాన్ని చూడాలి' అనే ఆమె కోరికను కుటుంబసభ్యులు నెరవేర్చారు. చీపురుపల్లి పట్టణానికి చెందిన కొత్తకోట సరస్వతి(75) గురువారం రాత్రి మరణించారు. తన మరణం తరువాత నేత్రదానం చేయాలని గతంలో ఆమె కుటుంబసభ్యులకు తెలియజేశారు. దీంతో ఆమె చెల్లెలు సుంకరి సరస్వతి, కుమారులు రాజు, నాగరాజు.. మానవీయత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు బివి గోవిందరాజులుకు సమాచారం ఇచ్చారు. అర్ధరాత్రి సమయంలో రెడ్ క్రాస్ సిబ్బంది రమణ, సుధాకర్ వచ్చి కార్నియాను సేకరించారు. అనంతరం విశాఖపట్నంలోని ఎల్‌వి ప్రసాద్ నేత్ర నిధికి పంపించారు. కార్యక్రమంలో సర్పంచ్ మంగళగిరి సుధారాణి, బెల్లాన వంశీ, గవిడి నాగరాజు పాల్గొన్నారు.

అమరావతి క్వాంటం వ్యాలీ 2కె25 హ్యాక్‌థాన్

ఫైనల్స్‌కు జెఎన్‌టియు విద్యార్థులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి నిర్వహించిన ప్రతిష్టాత్మకమైన అమరావతి క్వాంటం వ్యాలీ హ్యాకథాన్ 2025 సెమీ ఫైనల్స్ రౌండ్ పోటీలు ఈనెల 10న విశాఖలోని గాయత్రి విద్యా పరిషత్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగాయి. జెఎన్‌టియు జివి ఇంజినీరింగ్ విద్యార్థులు అత్యుత్తమమైన ప్రతిభతో అమరావతిలో జరగబోయే ఫైనల్స్ రౌండ్ నకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా జెఎన్‌టియు జివి విద్యార్థుల బృందానికి రాష్ట్ర ఉన్నత విద్యా మండలి రూ.10వేల చెక్కు, ప్రశంసా పత్రం అందజేసింది. విద్యార్థులను జెఎన్‌టియు జివి ఇంఛార్జి వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.రాజేశ్వరరావు, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్. పి.అరుణకుమారి తదితరులు అభినందించారు.

17న వేపాడ మండల సమావేశం

ప్రజాశక్తి-వేపాడ

ఈ నెల 17న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి సత్యవంతుడు అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు. అధికారులు పూర్తిస్థాయి సమాచారంతో రావాలని సూచించారు.

పోక్సో కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

ప్రజాశక్తి - కంటోన్మెంట్

తెర్లాం పోలీస్ స్టేషనులో 2025 ఫిబ్రవరి లో నమోదైన పోక్సో కేసులో నిందితుడు తెర్లాం మండలం బిసి కాలనీకి చెందిన కంకణాల కిరణ్ (36)కు విజయనగరం పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి 3ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.2వేలు జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు వెల్లడించినట్లు ఎస్‌పి వకుల్‌జిందల్ తెలిపారు. తెర్లాం మండలానికి చెందిన బాలిక (12) నడుచుకుంటూ తన ఇంటికి వెళుతుండగా అదే గ్రామానికి చెందిన కంకణాల కిరణ్ బాలికను అడ్డగించి, అసభ్యంగా ప్రవర్తించగా, బాలిక పెద్దగా కేకలు వేయగా, దగ్గరలో వున్న కొంత మంది పెద్ద మనుషులు వచ్చేసరికి నిందితుడు అక్కడ నుండి పారిపోయాడన్నారు. బాలిక తల్లి తెర్లాం పోలీస్ స్టేషనులో ఫిర్యాదు చేయగా ఎస్ఐ బి.సాగర్ బాబు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారని తెలిపారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారని తెలిపారు. పోలీసులు తరుపున పోక్సో కోర్టు ఇన్‌ఛార్జి పబ్లిక్ ప్రాసిక్యూటరు జి.సత్యం వాదనలు వినిపించారని తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి- కంటోన్మెంట్

జామి మండలం అలమండ రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాల మధ్యలో గుర్తు తెలియని పురుషుని మృతదేహం (45) లభ్యమైందని విజయనగరం రైల్వే హెచ్‌సి వి.అశోక్ తెలిపారు. మృతుడు సుమారు ఐదు అడుగుల ఐదు అంగుళాల పొడవు, ఛామన చాయ రంగులో ఉండి ఎరుపు రంగుపై తెలుపు గడుల షర్ట్, నీలం రంగు నైట్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడని తెలిపారు. వివరాలు తెలిసినట్లతే ఫోన్ నెంబర్లను 919490617089, 6301365605 సంప్రదించాలని తెలిపారు.